జీవిత చిత్రణ

# ప్రజాస్వామ్యం: సన్నకారు 'మేధావులు'

ద్రోణంరాజు కృష్ణమోహన్

గుర్నాథం ఒకరోజు తన భావిజీవితాన్ని గురించి చాలా తీవ్రంగా ఆలోచించసాగాడు ఉసిరి చెట్టుక్రింద చాపమీద పడుకొని. అప్పటికి అతని ఉద్యోగం పోయి సరిగా రెండువారాలైంది. చదువు కొన్నది స్కూలు ఫైనలు. రెండుసార్లు సర్వీసు కమీషన్ కెళ్లినా సెలెక్టు కాలేదు. రెండేళ్ళపాటు తాలూకాఫీసులోను, ఆరునెలలు పి. డబ్ల్యు. డి. లోను పనిచేశాడు. ఆ ఉద్యోగం కాస్తా పోయింది. ఇక ముందేమి చెయ్యాలనే ప్రశ్న అతన్ని తీవ్రంగా వేధించడం మొదలెట్టింది. చెట్టువైపు చూస్తూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఇంతకూ తన స్కూల్ ఫైనల్ చదువు ఎందుకు పనికొచ్చినట్లు? ట్రెయినింగు అవుదామంటే, రెండేళ్లు చదవాలి. సరిగా రెండు నెలలుకూడా వుద్యోగంలేనిదే గడవదు. అటువంటిది రెండేళ్ళు ఎక్కడనుంచి తెచ్చి ఖర్చుపెట్టగలడు? ఇంకా తన మీద ఆధారపడిన తల్లీ,తమ్ముడూ, చెల్లి వున్నారు. ఊరూరా తిరిగి నీళ్ళకావిళ్లు మోసి, వంటలుచేసి, తన తల్లిదండ్రులు యీనాటికి సంపాదించగలిగిన ఆస్తి ఒక్కఐదువందలగజాల స్థలం,అందులో చిన్న పాక అంతే. చివరిరోజుల్లో తండ్రి పక్షవాతంతో బాధపడుతూనే, వాళ్ళనీవీళ్ళనీ ఆశ్రయించి ఎలాగో స్కూల్ ఫైనల్ వరకు చదివించి, తాలూకాఫీసులో చేర్పించి మరీ వెళ్ళిపోయాడు యీ ప్రపంచం వదిలి! "ఎలా పోషిస్తావో బాబూ మీ అమ్మని తమ్ముడిని చెల్లెలిని. నీమీదే భారం వేసి మరీ పోతున్నా" ఇహ నాలుగైదుగంటలలో పోతా డనగా, తండ్రి అన్నమాటలు గుర్తొచ్చి కళ్ళ వెంబడి నీళ్ళు ధారాప్రవాహంగా కారిపోయాయి. "వాళ్ళకి ఏ లోటూరానివ్వను నాన్నా. నిశ్చింతగా వుండు"అని తాను యిచ్చిన వాగ్దానం గుర్తొచ్చి మరీ యిదయ్యాడు. వెక్కివెక్కిఏడ్చాడు. పదేళ్ళ తమ్ముడు, పదమూడేళ్ళ చెల్లెలు, పెళ్ళీడుకొచ్చిన చెల్లెలు, వృద్ధురాలవుతూన్న తల్లి, తనమీద ఆధార పడినారు. అందరికీ తనే ఆశాజ్యోతి. వెలుగుబాట! కాని తనో! ప్రస్తుతం గాఢాంధకారంలోపడి దారి తెన్ను గానక కొట్టుమిట్టాడిపోతున్నాడు. పూట ఒక యుగంలా గడుస్తోంది. దినమొక గండం. వృద్ధురాలవుతున్నా, వొంట్లో ఓపిక నానాటికీ పోతున్నా, తన తల్లి యీనాటికీ అప్పుడప్పుడు ఎవళ్ళింటికైనా వెళ్ళి వంటచేసిపెట్టో, కలవారిని పొగడో, నాలుగురాళ్లు తెచ్చి అవసరానికి సర్దు తున్నది. తను యింతవాడుండగా, వృద్ధాప్యంలో వున్న తల్లికి యిన్ని అగచాట్లా? అబ్బా! ఎంత కఠినజీవితం! ఎంత దుర్భర దారిద్ర్యం!

పోనీ తనకు వేరేమైనా ఉపాయాలు తెలుసునా, జీవితం సాఫీగా గడుపుకు పోయేందుకు? అదీలేదు. ఏవో కథలు వ్రాయడం నేర్చుకున్నాడు. స్నేహితులందరి దగ్గర పుస్తకాలు తెచ్చి తెగ చదువుతాడు. కొంత విజ్ఞానం సంపాదించుకొంటు న్నాడు కాని, యివి కూడు పెడుతున్నాయా? రచనలైతే చేస్తున్నాడు కాని, అవి అచ్చు కావడమే బ్రహ్మాండం! ఏదైనా కథగాని, నాటికగాని వ్రాసిపంపితే మూడు నెలలకో, నాలుగు నెలలకో, పడటం! అదిపడిన రెండు నెలలకి డబ్బు రావడం! కనీసం పది వారాలన్నా వ్యవధి కావాలనే పత్రిక ఒకటి. అధమయం 12 వారాలైనా వ్యవధి కావాలనే పత్రిక ఒకటి. మా కిచ్చిన కథలు బాగుంటే మేమే ప్రచురిస్తాం. ఎట్టి పరిస్థితుల్లోను, త్రిప్పిపంపబడవు అనే పత్రిక మరొకటి! ఇలా అయితే, యీ రచనలమీద కనీసం జేబుకర్చు కన్నా నెలకు సరిపోయేది రాదు. అందులోనూ కొండంత ఆశతో, పుట్టలుపుట్టలుగా వ్రాసిపంపడం, కట్టలుకట్టలుగా, అవి తిరిగిరావడం! ఏదో యింకా యిలాగే ఆలోచిస్తూ కాసేపు నిద్రపోయాడు.

గుర్నాథం ఆ రాత్రి అన్నానికి కూర్చోగానే తల్లి మూలుగుతూ వడ్డిస్తూ,

"ఏనాడు యీఇంటి లక్ష్మివచ్చి, నన్ను సుఖ పెడుతుందో!" అన్నది. గుర్నాథానికి అప్రసక్తి మహాచిరాకు. ఒకమూల పూటగడవటం కష్టంగా వుంటే, నెత్తిన మళ్ళీ అదోబరువు! ఎప్పుడూ పెళ్ళి గొడవ!

"ఇప్పుడెందుకే అమ్మా! మన అవస్థలు మనం పడటంచాలక, యింకో అభం శుభం తెలియని పిల్లనికూడా తీసుకొచ్చి కష్టపెట్టడం దేనికి?" విసుక్కున్నాడు గుర్నాథం.

"అలా అంటావేరానాయనా? నాపెళ్ళికి మీనాన్నగారి కేమాత్రం ఆస్తివున్నది? చదువు సంధ్యలుకూడా లేవు. సెంటుభూమిలేదు. అయినా యిద్దరం కష్టపడి సంసారం నెట్టుకొచ్చి, యింత వరకు మీకు ఏలోటు రాకుండా గడపలేదట్రా" ఆమెకు కంఠావరోధమైంది. కన్నీరు ప్రవహించింది. గుర్నాథం హృదయం ద్రవించింది. మాతృమూర్తి ఆవేదన, బాధ, చూడలేక పోయాడు. కన్నీరు వొత్తుకున్నాడు.

ఆరాత్రి తన పెళ్ళిగురించి ఆలోచనలో పడ్డాడు. ఇంతకూ తనతల్లి చెప్పేదేమిటి? పెళ్ళి చేసుకోమని! పాపం ఆమెకేం తెలుసు! వెనకటి రోజులే అనుకుంటుంది! ఇంతకూ ఎలాగో తంటాలు పడి, ఒకరిద్దెర్ను తాలూకా సిరస్తాదారు కూతుర్ని చూపించింది. ఎత్తుపళ్లు. ఒక కన్ను మెల్ల. కట్నం మూడువేలు. పిల్ల ఆకర్షణగలదే. నొక్కునొక్కుల జుట్టు చామనచాయ వర్ణం నిజంగా తనని ఎంతో ఆకర్షించాయి. కాని పళ్లు, మెల్ల కన్ను, చూసివద్దన్నాడు. ఇంక రెండు సంబంధాలు కూడ ఏవో వంకపెట్టి వద్దన్నాడు. అసలు చేసుకోవడం యిప్పుడు యిష్టంలేదు. పోనీ తనకు కూడా వొక "మిస్సమ్మ" వంటి యువతి, అలాంటి జమీందారు దంపతుల దయాదాక్షిణ్యాలు, దొరికితే జీవితం ఎంతబావుండును! పిల్లలకి పాఠాలు చెప్పి హాయిగా సంపాదిస్తూ కులాసాగాగడపొచ్చు. నిరుద్యోగసమస్య ఎంత తేలికగా పరిష్కారమై పోతుంది! కాని వచ్చిన చిక్కేమిటంటే అందరికీ అలాంటి భాగ్యం కలుగదు. ఇటాలియన్ చిత్రం "బైసికిల్ దొంగ"లో వుద్యోగం పోగొట్టుకొని రోడ్లుచ్చుకుని తిరుగుతుండే యువకుని జీవితంలా వుంది తన జీవితం యిప్పుడు. అంతేగాని విజయావారి "మిస్సమ్మ"లో హీరోగా లేడు తనిప్పుడు. సినిమాల్లో చూసేదానికీ, యథార్థ జీవితానికీ ఎంతభేదం వున్నది! పైగా ఆమిస్సమ్మ చూసినప్పటినుంచీ, ఏవో ఎన్నడూలేని తీయని కోరికలు కలగడం, కలలు రావడం మొదలుపెట్టాయి.

గుర్నాథం ధ్యాస క్లాస్సేపు ప్రణయరంగం వైపు మళ్ళింది. సినిమాలు, ప్రేమ ఇత్యాది విషయాలను ఆలోచిస్తూ నిద్రపోయాడు.

నెల రోజులు గడిచాయి. ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. చేతిలోవున్న రెండు ట్యూషన్లమీద వచ్చే ఇరవైరూపాయలే ఆధారం. అందులో ఒకటి చాలా త్వరలోనే పోయేటట్లుంది. వాళ్ళకి బదిలీ అయింది. ఇంక నెల్లాళ్ళకు,కుటుంబం వెళ్ళిపోతుంది. ఇహ కేవలం పది రూపాయలు! గుర్నాథం ఇవన్నీ లెక్కించుకునేసరికి అతని బుర్ర తిరిగిపోయింది. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. జీవితం! అతి భయంకరమైన జీవితం! దినమొక గండంగా గడపాల్సి వచ్చిన ఘోరమైన జీవితం!

ఒక రోజురాత్రి గుర్నాథంతల్లి మళ్ళీ పెళ్ళి సంగతి ప్రస్తావించింది.

"వాళ్లు వేరే సంబంధం చూసుకున్నారో ఏమోకూడ! ఎన్నాళ్ళకూ తెమిల్చి చెప్పవయ్యె! ఎలాగురా" ప్రాధేయపడింది. రాగాలెట్టింది.

"అమ్మా తెల్లవారే లోపు నీకు ఏ సంగతి చెప్పేస్తా" అని ధైర్యం చెప్పాడు.

ఆ రాత్రంతా నిద్దర్లేకుండా ఆలోచించాడు. తెగ చర్చించుకున్నాడు తనకు తానే. నిర్ణయాని కొచ్చాడు. తెల్లవారుతోంది. ఇంకాతల్లి నిద్రలేవ లేదు. వెళ్ళి హడావిడిగా లేపాడు.

"ఏంపిట్రా" కళ్ళునులుపుకుంటూ మూలుగుతూ దగ్గుతూ లేచింది తల్లి.

"మరేంవీలేదు. నేను పెట్టే ఒక షరతుకి వొప్పుకొంటే పెళ్ళి చేసుకుంటా."

"అయ్యో! ఇరవై పెట్టునాయనా" పొంగి పోతూ అన్నాది.

"పెళ్ళిలోవచ్చే మూడువేల కట్నంలోను,నువ్వు ఒక వెయ్యిమాత్రం పెళ్ళికి ఖర్చుచెయ్యాలి. మిగతా రెండువేలు నా చేతికిస్తే ఒక కిళ్ళీ కొట్టు పెడతాను. అందుకు నువ్వు, ఆ రాజోయేపిల్ల

అంగీకరించాలి" ధైర్యంగా కొండ బ్రద్దలుకొట్టినట్లు చెప్పేశాడు.

గుర్నాథంతల్లి తెల్లబోయింది. ఏదో దిగులు, ఆశ్చర్యం వెలిబుచ్చింది కళ్ళల్లో.

"ఇంతబ్రతుకూ బ్రతికి, యింతచదువూ చదివి, చివరకు కిళ్ళీకొట్టు పెట్టుకుంటామట్రా నాయనా" బ్రతిమాలింది ఆ అభిప్రాయం మానుకోమని. కాని గుర్నాథం భీష్మించాడు. తననిర్ణయానికి తిరుగు లేదన్నాడు.

"మీరు నీళ్ల కావిళ్లు మోసి, వంటలుచేసి సంసారం గడపలేదూ? నేను కిళ్ళీకొట్టు పెట్టుకుంటే అప్రతిష్ఠ వచ్చి పడిందా?" అని సవాల్ చేశాడు.

"అలా అయితే ముందుగా ఆ పిల్లకి చెప్పడ మెందుకూ?" అన్నది తల్లి. క్షణం ఆలోచించి సరేనన్నాడు గుర్నాథం.

పెళ్ళి లక్షణంగా జరిగిపోయింది. గుర్నాథం తనపంతం నెగ్గించుకున్నాడు.

*   *   *

గుర్నాథం పెళ్ళయి మూడేళ్ళయింది. ఒక పిల్లాడు. భార్యమళ్ళీ ఐదోనెల గర్భిణి. జీవితం వెను కటివలెనే వున్నది. ఏమీ మార్పులేదు. కిళ్ళీకొట్టు మీద ఏదో ఒక వందరూపాయలు దాదాపుగా వొస్తున్నాయి. కాస్త విశ్రాంతి ఎక్కువగావుండటం చేత బాగా తీరికగా కథలు, నాటికలు, వ్యాసాలు వ్రాస్తున్నాడు. దారితప్పి కొన్ని అచ్చు పడుతు న్నాయి. అయినా ఆర్థికపరిస్థితిలో పెద్దమార్పేమీ రాలేదు.

ప్రఖ్యాత యువకరచయిత, కథకుడు శ్రీ గుర్నాథరావు యీనాడు ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛగా ఒకకిళ్ళీకొట్టు పెట్టుకుని జీవిస్తున్నాడు. తిన్నా తినకపోయినా కోరికలు ఆశయాలు నెర వేరినా నెరవేరకపోయినా, కొత్తగా కాపరాని కొచ్చిన నవయవ్వనాంగి, అర్థాంగి, ముద్దు ముచ్చట్లు తీరినా తీరకపోయినా, వృద్ధురాలైన తల్లి యీనాటికీ వంటలు చేయాల్సిన అవసర మొచ్చినా రాకపోయినా, చెల్లెలి పెళ్ళికి, తమ్ముడి పైచదువులకి డబ్బు మిగిల్చినా మిగల్చకపోయినా, గుర్నాథంతోగాని అతని జీవితంతోగాని ప్రభు త్వానికైతేనేం, ప్రజలకైతేనేం, జోక్యమనవసరం! అతను పరిపూర్ణమైన స్వేచ్ఛను అనుభవిస్తున్నాడు.

---

మానవ నైజం

# రూపాయిలు అణాలు పైసలు

మధిర భానుమూర్తి

ఒక మహనీయుని జీవితచరిత్ర చదువుతున్న రోజుల్లో ఒక మిత్రుడు వచ్చాడు. అతను నాకు చాలా సన్నిహితుల్లో ఒకడు. మా స్నేహం ఈ నాటిదికాదు. ఎంతోకాలంగా స్నేహితులం అవటంవల్ల మా ఇద్దరి మధ్యన ఏమీ దాపరికాలు లేవని చెప్పవచ్చు. అందుచేతనే అతను వస్తూనే "ఏమిటోయ్! అంత గ్రంథం తీసుకు తీవ్రంగా చదువుతున్నావ్?" అని ప్రశ్నించాడు. నేను వెంటనే చెప్పాను'ఫలానా'వ్యక్తి జీవితచరిత్ర అని.

"ఏ పరీక్షకి పెట్టారు?" అని అడిగాడు ఆదుర్దాగా. ఈ పుస్తకం పరీక్షకి పెట్టడమేమిటా అని తెల్లబోయి చూస్తూన్నాను నేను. వెంటనే తనకు జవాబివ్వక తెల్లబోయి చూస్తున్న నా అవస్థను కనిపెట్టిన నా మిత్రుడు తన ప్రశ్నను వివరించాడు. "అదికాదు. నువ్వు ఇప్పుడు ఏపరీక్షకైనా కట్టావా?... ఈ పుస్తకం ఏదేనా పరీక్షకి పెట్టారా?...నువ్వు చదువుతుంటే అది ఏ పరీక్షకేనా పెట్టారేమో ననుకున్నాను...పాఠ్యగ్రంథం కాకపోతే చదవటం ఎందుకు?..." అని నాకు ఆశ్చర్యంవేసింది. పాఠ్యగ్రంథం అయితేనేగాని ఏ పుస్తకం చదవవలసిన అవసరం ఉండదనే నిశ్చయానికి వచ్చిన నా మిత్రుని వైఖరి చూస్తే కొందరి దృష్టిలో అంతే. ఏ పనేనా తాము చేస్తే దాని ఫలితం వెంటనే పొందగలగాలి. అలా